Namaste Telangana

# కొలువుల కల సాకారం

## 40 వేలకు చేరనున్న కొత్త ఉద్యోగాలు

- ఇప్పటికే 37,170పోస్టులకు ఆర్థికశాఖ అనుమతి
- త్వరలో మరో 3 వేల ఉద్యోగాలకు..
- ప్రత్యక్షంగా 28,720 పోస్టులు.. పరోక్షంగా 8,450పోస్టులు
- త్వరలో మరో 3 వేల పోస్టులు!

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సాధన ఫలితాలు ఒక్కటొక్కటిగా అనుభవంలోకి వస్తున్నాయి. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన నినాదంగా సాధించుకున్న రాష్ట్రంలో ఆ కలలు వాస్తవరూపం దాల్చుతున్నాయి. దశాబ్దాల పాటు ఉద్యోగాల కల్పనలో దగాపడ్డ తెలంగాణలో ఇపుడు కొలువుల జాతర సాగుతున్నది. తాజాగా విడుదలైన గ్రూప్ 2 ప్రకటన యువతకు దసరా పండుగ ఆనందాన్ని ద్విగుణీకృతం చేసింది. రాష్ట్ర ఆవిర్భావంనుంచి ఇప్పటిదాకా 37వేలకు పైగా ఉద్యోగాల నియామకాలకు ఆర్థికశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో ప్రత్యక్ష నియామకాలు 28,720కాగా పరోక్ష నియామకాలు 8,450. ఇవిగాక మరో మూడు వేల పోస్టులకు కూడా త్వరలో అనుమతి లభించనుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బాలారిష్టాలను విజయవంతంగా అధిగమించిన ప్రభుత్వం, పాలనను చక్కదిద్దుకొని రాష్ట్ర సాధన లక్ష్యాల మీద దృష్టి పెట్టింది. నీటి పారుదల ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తూనే నియామకాల విషయంలో లక్ష ఉద్యోగాల హామీ నెరవేర్చే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లింది. గ్రామీణాభివృద్ధి శాఖ, నీటిపారుదల శాఖనుంచి ఉద్యోగ నియామకాల ప్రారంభించి ఒక్కో ప్రభుత్వ శాఖను సమీక్షిస్తూ ఖాళీల భర్తీ కోసం చకాచకా ఆర్థిక పరమైన అనుమతులను జారీ చేస్తున్నది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే వేలాదిమంది యువకులు ఉద్యోగాలను పొంది కొత్త జీవితాన్ని ప్రారంభించారు. తాజాగా టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 2 ఉద్యోగాల ప్రకటనతో యువతలో ఆనందం వెల్లివిరుస్తున్నది.

**ఇవీ కొలువుల వివరాలు..**

వివిధ ప్రభుత్వ శాఖలలో కొత్త నియామకాలు, ఖాళీల భర్తీలకు దాదాపు 37వేల170 పోస్టులకు ఆర్థిక అనుమతినిచ్చింది. ఇందులో ప్రభుత్వశాఖల్లో 28,720 పోస్టులు ఉండగా, ఆర్టీసి, సింగరేణిలో మరో 8,450పోస్టులున్నాయి. ఆర్థిక శాఖ కొత్తగా మరో రెండు నుంచి మూడు వేల పోస్టులకు త్వరలో అనుమతులను ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నది. వాటిలో గిరిజన సంక్షేమశాఖ, అటవీశాఖ తదితర శాఖల పోస్టులున్నాయి. ఆ మేరకు ఖాళీలు, నియామకాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అవసరమైన చోట వెంటవెంటనే ఉద్యోగాలను కల్పించే ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆర్థిక శాఖ అనుమతించిన వాటిలో 13వేల 685 పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ)కు అప్పగించారు. వాటిలో 4వేలకు పైగా నియామకాలు పూర్తయ్యాయి. మరో రెండువేల వరకు పరీక్షల నిర్వహణ పూర్తయింది. నియామకపత్రాలను జారీ చేయాల్సి ఉంది. కోర్టులో వివాదం వల్ల వ్యవసాయశాఖలో 1300 విస్తరణాధికారుల, ఎగ్జిక్యూటివ్‌ల నియామకాలు తాత్కాలికంగా ఆగిపోయాయి. త్వరలోనే వీటి నియామకపత్రాలను అందచేసే అవకాశముంది. ఇక తాజాగా 1032 గ్రూప్–2పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన టీఎస్‌పీఎస్సీ, మరో 5,600 గురుకుల, టీచర్ పోస్టుల కోసం నోటిఫికేషన్‌ను సిద్ధం చేసింది. వైద్య,ఆరోగ్యశాఖలో 2,118పోస్టులకు కూడా టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలిసింది. ఇవిగాక వాణిజ్యపన్నుల శాఖలో 19సీటీవోల పోస్టుల భర్తీకి ప్రభుత్వం శనివారం అనుమతులను జారీ చేసింది. మరోవైపు నిరుద్యోగులకు కల్పతరువుగా మారిన ఆర్టీసిలో 3,950మంది డ్రైవర్లు, కండక్టర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించారు. సింగరేణిలో,ఇంజనీర్లతో పాటు మొత్తం 4,500మంది ఉద్యోగులను నియమించారు. నీటిపారుదల శాఖలో ఇంజనీర్ల ఖాళీలన్నీ భర్తీ చేశారు. ఇంతవరకు జరిగిన నియామకాల వల్ల ఇప్పటికే రాష్ట్ర ఖజానాపై ఏటా 12వందల కోట్ల భారం పడుతుందని అంచనా.

### ఇదీ కొలువుల పండుగ...

| శాఖ | పోస్టుల సంఖ్య |
|---|---|
| వ్యవసాయ, సహకారం | 1738 |
| పశుసంవర్థక,మత్స్యశాఖ | 0765 |
| బీసీ సంక్షేమం | 307 |
| పర్యావరణం, అటవీశాఖ | 0065 |
| విద్యుత్‌శాఖ | 2681 |
| ఆర్థికశాఖ | 0028 |
| సాధారణ పరిపాలనాశాఖ | 0090 |
| హోంశాఖ | 12,354 |
| నీటిపారుదల శాఖ | 00623 |
| పరిశ్రమలు,వాణిజ్యం | 00020 |
| న్యాయశాఖ | 00010 |
| కార్మిక,ఉపాధి కల్పనాశాఖ | 00003 |
| పురపాలక,పట్టణాభివృద్ధి | 01312 |
| మైనార్టీ సంక్షేమం | 00630 |
| పీఆర్,గ్రామీణాభివృద్ధి | 01037 |
| రెవెన్యూ | 01166 |
| ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ | 02552 |
| విద్యాశాఖ | 00399 |
| ట్రాన్స్‌పోర్ట్, బిల్డింగ్ | 00365 |
| గిరిజన సంక్షేమం | 00436 |
| వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమం | 02139 |
| **మొత్తం** | **28,720** |

**పరోక్ష నియామకాలు**

| | |
|---|---|
| టీఎస్‌ఆర్టీసి | 3,950 |
| సింగరేణి | 4500 |
| | **8450** |